క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

గద్వాల: డీకే కుటుంబానికి నమ్మకంగా, ముఖ్యఅనుచరుడిగా పేరుపొందిన గ్యాస్ నర్సింహారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆమె గద్వాల పట్టణంలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్ల మరమ్మతుకు శ్రీకారం



సాక్షి ఎఫెక్ట్..

అయిజ: మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్లు మోకాలులోతు గుంతలుపడి వాటిలో మురుగు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు శనివారం శ్రీకారం చుట్టారు. పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు, పాతబస్టాండ్ కాలనీలో తూంకుంట-ఎక్లాస్‌పురం రోడ్డు, అయిజ-గద్వాల ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చే పనులు మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. దానికోసం మున్సిపాలిటీ కార్యాలయానికి చెందిన ట్రాక్టర్లు, డోజర్లను ఉపయోగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జూన్ నెలలో చేపట్టిన టీజీఏఐఎంఎస్ సర్వేలో వెలుగులోకి వచ్చిన శిథిలావస్థకు చేరిన స్తంభాలు మార్చుట, 11కేవీ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు జిల్లా కేంద్రంలోని భీంనగర్, రాజీవ్‌మార్గ్, నల్లకుంట, లింగంబాగ్ కాలనీ, శ్రీనివాస కాలనీ, గంజిరోడ్డు, పెద్ద అగ్రహారం, చింతలపేట, డ్యాం రోడ్డులోని ఇండస్ట్రీకి విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గద్వాల మండలంలోని చెనుగోనిపల్లికి సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

కుట్టుమిషన్‌పై విద్యార్థులకు అవగాహన

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామంలోని సురవరం విజ్ఞాన కేంద్రంలోని విద్యార్థులకు కుట్టుమిషన్‌పై అవగాహన కల్పించారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9,10 వ తరగతి విద్యార్థులు కుట్టుమిషన్‌లో దుస్తులను ఎలా కుట్టాలని శిక్షణ కేంద్రంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు నర్మద ఆధ్వర్యంలో నేర్పించారు.

శ్రీకృష్ణస్వామికి బంగారం వితరణ



మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి శ్రీ కృష్ణస్వామి వారికి శనివారం అయిజ పట్టణానికి చెందిన అల్వాల గజేంద్రగౌడ్ 23 గ్రాముల బంగారాన్ని వితరణ చేశారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలకు పూలమాల, శాలువాతో సత్కరించి మెమోంటోను అందజేశారు. స్వామి వారికి మొక్కులో భాగంగానే బంగారం వితరణ చేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, రాంగోపాల్, ఆలయ అర్చకులు కృష్ణయ్యచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన బైక్

ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి కర్నూల్‌కు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి జాతీయ రహదారికి చేరుకునే సమయంలో మలుపు చూడకుండా నేరుగా ఆర్డీఎస్ కెనాల్‌లోకి దూసుకెళ్లాడు. వ్యక్తికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. కర్నూల్‌కు చెందిన మహ్మద్ రఫీ మేస్త్రీ పనికి వచ్చి మద్యం తాగి బైక్ నడుపుతూ నేరుగా కాల్వలోకి వెళ్లిపోయాడు. అతనికి ఈత రావడంతో సురక్షితంగా బయట పడ్డాడు. రాత్రి సమయం కావడంతో బైక్ నీళ్లలో కనిపించలేదు.

వాహనాల తనిఖీ

అలంపూర్: పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో ఆవులను తరలిస్తున్న వాహనాన్ని సరిహద్దులో పోలీసులు తనిఖీలో పట్టుకున్నారు. శనివారం బీజేపీ నాయకుల సమాచారం మేరకు బులెరోలో పశువులను తరలిస్తుండగా అలంపూర్ ఎస్ఐ నాగరాజు, ఉండవెల్లి ఏఎస్ఐ సుబ్బారెడ్డి తనిఖీ చేశారు. వాహనంలో మూడు ఆవులు, మూడు దున్నపోతులను గుర్తించారు. పెబ్బేరు సంతలో కొనుగోలు చేసి కర్నూల్ జిల్లా కల్లూరుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వాటిని అక్రమంగా తరలించడం లేదని, జీవనం కోసమే తీసుకెళ్తున్నట్లు బాధితులు చెప్పడంతో పోలీసులు అన్ని పరిశీలించి పంపించారు.

స్కూళ్లకు స్కావెంజర్ల కొరత

- పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం దొరికేనా..
- పంచాయతీ కార్మికులతో పాఠశాలలను శుభ్రం చేయిస్తున్న వైనం
- అమ్మఆదర్శ కమిటీలకు బాధ్యతలు అప్పగించేనా..



ఉండవెల్లి పాఠశాలలో గదులను శుభ్రం చేస్తున్న కార్మికులు(ఫైల్)

ఉండవెల్లి: ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలంటే కార్మికులు వెళ్లాల్సిందే. స్కావెంజర్ల నియామకానికి ప్రభుత్వం కసరత్తు చేసినా ఎలాంటి ఫలితం లేదు. పారిశుద్ధ్యానికి స్కూల్ ఫెసిలిటి మెయింటెనెన్స్ నిధులు మంజూరు చేస్తోంది. వాటితో తాత్కాలిక స్కావెంజర్లను నియమించుకోవడం, పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడం, తదితర పనులు చేపట్టనున్నారు. అమ్మఆదర్శ పాఠశాలలకు కమిటీలను నియమించే బాధ్యత అప్పగించడంతో ప్రధానోపాధ్యాయులా, మహిళా సంఘాల అధికారులా నియమించేదని సతమతమవుతున్నారు. సమగ్ర శిక్ష కింద అందుతున్న గ్రాంట్‌కు ఇది అదనం.

కార్మికులకు కష్టాలు తీరేనా..

మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, 12 ప్రాథమిక పాఠశాలలున్నాయి. 2021 సెప్టెంబర్ వరకు పాఠశాలల్లో స్కావెంజర్లు ఉండేవారు. తర్వాత వారిని తొలగించి పారిశుద్ధ్య బాధ్యతలు కార్మికులకు అప్పగించారు. వారికి పని భారం, జీతాలు సకాలంలో రాకపోవడంతో పాఠశాలలకు రావడం మానేశారు. కొన్ని మండలాల్లో పారిశుద్ధ్య కార్మికులే పాఠశాలల్లో పరిశుభ్రం చేస్తున్నారు. దీంతో కార్మికులు ఉంటేనే బడిని ఊడ్చేవారు. లేదంటే వేరే వాళ్లు చేసేవారు. ఇప్పటికీ మండల కేంద్రంలోని రెండు పాఠశాలలో కార్మికులే ఊడుస్తూ, బాత్రూంలు శుభ్రం చేస్తున్నారు. తమను ఎట్టి చాకిరి చేయిస్తున్నారని ఇద్దరు కార్మికులు రావడం మానేశారు. మరికొన్ని చోట్ల విద్యార్థులే ఊడుస్తున్నారు.

పది నెలలు నిధులు మంజూరు..

పాఠశాలల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ 21 విడుదల చేసింది.



ఉండవెల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ నుంచి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధుల మంజూరు చేయనుంది. 1-30 మంది విద్యార్థులుంటే రూ.3 వేలు, 31 - 100 మంది ఉంటే రూ.6వేలు, 101-250 మంది ఉంటే రూ.8 వేలు, 251-500 మంది ఉంటే రూ.12 వేలు, 501-750 వరకు ఉంటే రూ.15 వేలు, 750 నుంచి పైన విద్యార్థులుంటే రూ.20 వేలు మంజూరు చేయనుంది. నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రతి మూడు నెలలకోసారి నిధులు విడుదలవుతాయి. కమిటీ, ప్రధానోపాధ్యాయుల భాగస్వామ్యంతో స్కావెంజర్లను అగ్రిమెంట్ చేసుకోకుండా వీరు నిర్వహించాల్సిన విధులు ముందుగానే తెలియజేయాలి. సక్రమంగా విధులు నిర్వహించకుంటే వారిని తొలగించి కొత్తవారిని నియమించుకోవచ్చు.

స్కావెంజర్లను ఏర్పాటు చేస్తే సంతోషమే..

రెండేళ్లుగా స్కావెంజర్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. చాలా చోట్ల హెచ్‌ఎంలు సొంత ఖర్చులతో స్కావెంజర్లను నియమించారు. స్కూల్ ఫెసిలిటి మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు చేయడం సంతోషకరం. ఇప్పటి వరకు ఎలాంటి గైడెన్స్ రాలేదు.

– హేమలత, హెచ్‌ఎం, ఉండవెల్లి

కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాం..



గ్రామాల్లో ఉన్న కార్మికులకు పంచాయతీ పరిధిలోనే పనులు చేయాలని ఉత్తర్వులొచ్చాయి. కానీ మండల కేంద్రంలో కార్మికులు పాఠశాలలో విద్యార్థులు చేయలేరని పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహిస్తున్నారు. అందువల్ల పని ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం పాఠశాలలకు స్కావెంజర్లను నియమిస్తే కార్మికులకు పని ఒత్తిడి తగ్గుతుంది.

– తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగకరం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సీఎంరిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో గద్వాల మండలానికి చెందిన 38మంది లబ్ధిదారులకు రూ. 10,23,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంబురామన్‌గౌడ్, గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రమేష్, ప్రతాప్‌గౌడ్, రాజారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యనారాయణ, పూడూరు చిన్నయ్య, నాగన్న, మన్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డికి మెమోంటోను అందజేస్తున్న ఆలయ చైర్మన్

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణ మొత్తం పోటెత్తింది. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప , శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

అలంపూర్ మాజీ ఎమ్మెల్యే పూజలు

ఆదిశిలా క్షేత్రంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, చారు. ఆలయ విశిష్టతను వివరించారు. మాజీ ఎమ్మెల్యేను పూలమాల, శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, మాజీ ఎంపీపీ తాటికుంట మధుసూదన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గురుస్వామి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఓటరు జాబితాను త్వరగా పూర్తి చేయాలి



మద్దెలబండ పెద్దతండాలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మల్దకల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాలో వార్డుల వారీగా విభజించి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి బీఎల్ఓలకు సూచించారు. శనివారం మండలంలోని సద్దలోనిపల్లి, మంగంపేట, మద్దెలబండ పెద్దతండాలో ఓటరు జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో బీఎల్ఓలు చేపడుతున్న ఓటరు జాబితా విభజనను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించి కొత్తవారి పేర్లను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామికి జలాభిషేకం



కృష్ణానది నుంచి జలాల తీసుకొస్తున్న భక్తులు



వడ్డేపల్లి నుంచి ఎడ్లకాడీలతో వెళ్తున్న రైతులు

కేటీదొడ్డి: వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని వెంకటాపురం, పాగుంట గ్రామాల రైతులు, గ్రామస్తులు పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రావణమాసం మూడో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కాడెద్దుల, ఎడ్లబండ్లతో కృష్ణానది పుణ్యక్షేత్రానికి బయలుదేరి కృష్ణ పవిత్ర జలాలు తీసుకొచ్చి ర్యాలీ చేశారు. ఆలయం వరకు పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

గట్టు తిమ్మప్పస్వామికి..

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఎద్దుల బండ్లతో వెళ్లి తుంగభద్ర నది నీటిని తీసుకొచ్చి వెంకటాపురంలోని గట్టు తిమ్మప్ప స్వామికి జలాభిషేకం చేశారు. పాడి పంటలు బాగుండాలని, అధిక దిగుబడి రావాలని కోరారు. వెంకటాపురం ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు. పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఎడ్ల కాడీలతో వడ్డేపల్లి నుంచి..

శాంతినగర్: వర్షాలు సమృద్ధి కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ వడ్డేపల్లి వాసులు ఎడ్ల కాడీలతో కొంకలకు బయల్దేరి వెళ్లారు. శ్రావణమాసం శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిలో ప్రతిష్ఠించి ఎడ్లకాడీలతో కొంకలలో వెలసిన ఆంజనేయస్వామి వారి ఆలయానికి తీసుకెళ్లడం తరతరాలుగా వస్తోంది. కొంకల రైతులు వడ్డేపల్లికి స్వామివారిని భక్తి శ్రద్ధలతో తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే వానలు సమృద్ధిగా కురుస్తాయని రైతుల విశ్వాసం. వడ్డేపల్లి నుంచి క్రమశిక్షణతో ఎడ్లకాడీలు వెళ్తుంటే పట్టణ వాసులు, రైతులు, ప్రయాణికులు ఎద్దులను చూస్తూ ఆనందం వ్యక్తంచేశారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



శాంతినగర్: వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్ కోయిల్‌దిన్నె రోడ్డులో నిర్మించనున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విజయుడు శనివారం భూమి పూజ చేశారు. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి 18 సెంట్ల స్థలం దాతగా ఇచ్చిన సూర్యప్రకాష్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే హాజరై భూమిపూజ చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



అయిజ: పట్టణంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో ప్రైవేట్ పాఠశాలలో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



మానవపాడు: వ్యక్తిగతంగా, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్యకేంద్ర సూపర్‌వైజర్ చంద్రన్న సూచించారు. శనివారం మండల కేంద్రంలో పరిశుభ్రతపై సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టల్‌లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలు సురక్షిత వాతావరణంలో పెరగాలి

ధరూరు: బాలలందరూ సురక్షిత వాతావరణంలో పెరగాలని బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పేరు జెడ్పీహెచ్ఎస్‌లో శ్రీ శిశు సంక్షేమ శాఖ వారి బాలల సంరక్షణ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం ఈ బాల రక్షా భవన్ ఏర్పాటు చేశామన్నారు. బాల్యం పిల్లల హక్కు అని వారంతా ప్రశాంత వాతావరణంలో పెరగాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహులు, సూపర్‌వైజర్ సునీతమ్మ, ఉమన్ హబ్ కో ఆర్డినేటర్ సరోజ, చిట్టమ్మ, సఖి కేంద్రం కవిత పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు



గుర్రంగడ్డకు బోటులో ప్రయాణిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే గుర్రంగడ్డ గ్రామాభివృద్ధికి నోచుకోలేదని, తద్వారా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం ఆమె బీరెల్లి నుంచి గుర్రంగడ్డ వరకు బోటులో ప్రయాణించి గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గుర్రంగడ్డ బ్రిడ్జి, బీసీ కమిటీ హాల్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ముందుగా జములమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, మధుసూదన్ బాబు, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్ రెడ్డి, రాముడు ఉన్నారు.

ఆదిశిలాక్షేత్రంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తాటికుంట గ్రామ కాంగ్రెస్ నాయకుడు రామచంద్రారెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, మల్లికార్జున్, గోవిందు, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక



ఉండవెల్లిలో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

ఉండవెల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి అండర్ -14, 17 ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల విద్యాధికారి శివ ప్రసాద్ క్రీడలు ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. బాలుర వాలీబాల్‌కు ఏడుగురిని, కబడ్డీకి 8 మంది, ఖోఖో 7 మంది ఎంపిక చేశారు. బాలికల్లో ఖోఖో-8, కబడ్డీ-ఆరుగురి విద్యార్థినులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు పీడీ శైలజ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నాగార్జున, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి భరత్ కుమార్, తక్కశిల పీడీ శ్రీనివాసులు, క్యాతూరు పీడీ రాజు, మానవపాడు పీడీ సింధు రాణి, జల్లాపూర్ పీడీ తిరుపతి, కేజీబీవీ పీఈటీ అరుణతార, మైనార్టీ పీఈటీ రాధ, తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్

నాణ్యమైన భోజనం అందించాలి

మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి మండల విద్యాధికారి విద్యార్థుల నైపుణ్యాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మంచి రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టు పూడిక తీత చేపట్టాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్‌లో పేరుకుపోయిన ఒండ్రు మట్టి పూడిక తీత పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు రైతులతో కలిసి వివిధ ప్రజా, రైతు సమస్యలపై చర్చించారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసి పూడిక తీతపై దృష్టిసారిస్తే మరిన్ని నీళ్లు రిజర్వాయర్‌లో నిలిపే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు తెలంగాణ రైతాంగ సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజు, రాముడు, లక్ష్మన్న, బొడ్డన్న, గోకారన్న, అయ్యన్న, కర్రెన్న, గోవిందు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోండి



మండల మహిళా సమాఖ్య భవనంలో మాట్లాడుతున్న ఏపీఎం శోభారాణి

ధరూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఏకేపీ ఏపీఎం శోభారాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళా శక్తి పథకం అమలు తీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన మహిళా సంఘాల సభ్యులు పాడి గేదెలు, నాటు కోళ్ల పెంపకం తదిర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి వెంకట్రావు, శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ రషీద్, సీసీలు జయరాజ్, రాఘవేంద్ర, రాములు, శేఖర్, నవీన్, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, వీఓఏలు పాల్గొన్నారు.

పాత విధానాన్ని కొనసాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: భవన నిర్మాణ కార్మికులు డెలివరీ కానుక, మ్యారేజ్, డెత్ క్లైమ్స్ దరఖాస్తుకు వేలి ముద్ర ఆప్షన్ పెట్టడంతో వివిధ కారణాలతో వేలి ముద్రలు నమోదు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంజిపేట రాజు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్మికశాఖ కార్యాలయంలో ఏసీఎల్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది కార్మికులు సంక్షేమ పథకా కోసం నమోదు చేసుకునే క్రమంలో వేలి ముద్ర సమస్య తలెత్తుతుందన్నారు. వాటిని పరిష్కరించేందుకు మీ సేవ, కార్మిక శాఖ కార్యాలయం చుట్టు తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే పాత పద్ధతినే కొనసాగించాలన్నారు. రాజు, మురళీ, బడేసాబ్, శివ, హరి, రాజేష్ ఉన్నారు.

కేసు నమోదు

కేటీదొడ్డి: మండలంలోని రంగాపురంలోని జంగిలప్ప గుట్టుగా సీహెచ్‌ను నిల్వ చేసినట్లు సమాచారం మేరకు శనివారం గద్వాల ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ సైదిరెడ్డి సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. రెండు కేజీలకు పైగా సీహెచ్‌ను స్వాధీనం చేసుకుని, 49 లీటర్ల కల్లు పారబోసి జంగిలప్పపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.